
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి







అభిమానుల ఆనందోత్సాహం



అశేషంగా తరలి వచ్చిన జనం



ప్రజలకు అభివాదం తెలుపుతున్న చంద్రబాబు నాయుడు

సైకోను తరిమికొట్టండి

- జగన్ బొమ్మల పిచ్చోడు
- రాతియుగానికి స్వస్తి పలకాలి
- స్వర్ణయుగం కోసం నాతో నడవండి
- ఉమ్మడి జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తా
- సాగు నీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేస్తా
- సంక్షోభం నుంచి నాపరాయి పరిశ్రమను గట్టెక్కిస్తా
- పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తా
- వైసీపీ పాలనలో వ్యవస్థలు నాశనం
- ఎమ్మెల్యేల అక్రమాలు అన్నీ ఇన్నీ కావు
- రా.. కదలి రా.. సభలో చంద్రబాబు ధ్వజం



నంద్యాల టౌన్/ఆళ్లగడ్డ, జనవరి 9: రాష్ట్రంలో జలగన్న పాలన రాతియుగాన్ని మరిపిస్తున్నదని, స్వర్ణయుగం రావాలంటే ప్రజలందరూ తనతో కలిసి నడవాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డలో రా.. కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు చేసిన ప్రసంగం వేలాది మంది జనాన్ని ఉర్రూతలూగించింది. బొమ్మల పిచ్చోడు జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టాయని ధ్వజమెత్తారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కర్నూలు, నంద్యాల జిల్లాల అభివృద్ధి అధఃపాతాళంలోకి వెళ్లిపోయిందని అన్నారు. టీడీపీ హయాంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పుల కోసం నందికొట్కూరు ప్రాంతంలో జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టును రూ. 365 కోట్లతో ప్రారంభిస్తే తన్ని తరిమేశారన్నారు. నంద్యాల ప్రాంతాన్ని మెగా సీడ్ హబ్‌గా మార్చేందుకు రూ.650 కోట్లతో ప్రణాళిక చేపట్టామని, ఈ ప్రాజెక్టు పూర్తి అయివుంటే విత్తనోత్పత్తిలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేవారమని తెలిపారు. ఓర్వకల్లులో 15 నెలల వ్యవధిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం, పారిశ్రామిక వాడ అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఎమ్మిగనూరుకు టెక్స్‌టైల్ పార్కు తెస్తే దానికి కూడా మోకాలడ్డారని ధ్వజమెత్తారు. కర్నూలుకు హైకోర్టు తీసుకువస్తామని చెప్పిన అధికార పార్టీ నాయకులు చేతులెత్తేసిన విషయాన్ని ప్రజలంతా తెలుసుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో ఆరు వేల మెగావాట్ల ఉత్పత్తితో నిర్మించిన సోలార్ పవర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే పెద్దదని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

ఉమ్మడి జిల్లాలో ముచ్చుమర్రి, పులికనుమ, అలగనూరు, గోరుకల్లు, అవుకు తదితర సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేశామని నారా చంద్రబాబు భరోసా ఇచ్చారు. వైసీపీ పాలనలో రిజర్వాయర్లు దెబ్బతిని నీటి నిలువకు ఇబ్బందులు పడుతుంటే మరమ్మతులకు సైతం నిధులు మంజూరు చేయని దుస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్ ఒక్క సాగు నీటి ప్రాజెక్టునైనా కట్టాడా అని ప్రశ్నించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చేందుకు, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగుగంగ పథకం చేపట్టి చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి బంగారు పంటలు పండే విధంగా చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీ పాలన మొత్తం అరాచక, అవినీతి, అక్రమార్జనలు, వేధింపులు, అక్రమ కేసులమయంగా మారిందని విమర్శించారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య, ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్య హత్య ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలని, వైసీపీ అరాచక పాలనకు ఇవి ప్రత్యక్ష నిదర్శనాలున్నాయని అన్నారు.

ఉమ్మడి జిల్లాకు మహర్దశ తేవడమే లక్ష్యం

టీడీపీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాకు మహర్దశ కల్పించడమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. ఓర్వకల్లు మండలంలో మల్లికార్జున రిజర్వాయరు ఫీడర్ చానల్ పూర్తి చేస్తామని తెలిపారు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని చెరువులకు నీళ్లు నింపే ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిరు. వేదవతిని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం సిద్ధాపురం ఇరిగేషన్ ప్రాజెక్టుకు కనీసం కరెంటు బిల్లులు కట్టడం లేదని, ఈ పరిస్థితిని చక్కదిద్దుతామని చెప్పారు. మిడుతూరు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తామని, నందికొట్కూరుకు పరిశ్రమలు తెస్తామని భరోసా ఇచ్చారు. బనగానపల్లె నియోజకవర్గంలో పెద్దకొప్పెర్ల ఎత్తిపోతల పథకం పూర్తి, కుందూ నదిపై చెక్‌డ్యాంలు నిర్మిస్తామన్నారు.



భూమా శోభా నాగిరెడ్డి ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు నాయుడు

రాయలసీమను ఏం ఉద్ధరిస్తాడు?

రాయలసీమలో ఇరిగేషన్ కోసం టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.12,454 కోట్లు ఖర్చు చేస్తే కనీసం 25 శాతం కూడా జలగన్న ఖర్చు చేయలేదని, ఇలాంటి వ్యక్తి రాయలసీమను ఉద్ధరిస్తాడా? అని చంద్రబాబు ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అలగనూరు రిజర్వాయరుకు మరమ్మతులు చేస్తామన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సాగు నీటి ప్రాధాన్యత, 90 శాతం రాయితీతో డ్రిప్ రైతులకు అందజేస్తామన్నారు. పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. టీడీపీ హయాంలో రోడ్లు అభివృద్ధి చేశామని, జాతీయ రహదారుల నిర్మాణం, తిరుపతిని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు స్థాయికి పెంపు చేశామని తెలిపారు.



ఆళ్లగడ్డలో దివ్యాంగుడితో కారు దిగి మాట్లాడుతున్న చంద్రబాబు

నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం

సంక్షోభంలో ఉన్న నాపరాయి పరిశ్రమను ఆదుకునేందుకు గతంలో ఉన్న పద్ధతులను చేపడతామన్నారు. బనగానపల్లె-కోవెలకుంట్ల బైపాస్ రోడ్డును నిర్మిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తామని వివరించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని, హంద్రీ-నీవా, గాలేరు-నగరి పూర్తి చేస్తామని వెల్లడించారు. తుంగభద్ర, హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీలను ఆధునికీకరిస్తామని, గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేస్తామని, ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేసి వాటర్‌గ్రిడ్ ద్వారా ఇంటింటికి నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా అఖిలప్రియ, యువ నాయకులు భూమా విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడు, నంద్యాల టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్, మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, సి.రామచంద్రయ్య, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, జిల్లెల శ్రీరాములు, గడ్డం రామకృష్ణారెడ్డి, పోతురాజు రవికుమార్, వై.నాగేశ్వరయాదవ్, గోగిశెట్టి నరసింహారావు, కార్యనిర్వాహక కార్యదర్శి వహాబ్, ఆళ్లగడ్డ జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్యతోపాటు టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వేదికపై టీడీపీ నాయకులు

మీరూ మా కుటుంబ సభ్యులే..

- అధైర్యపడకండి టీడీపీ అండగా ఉంటుంది
- కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన నారా భువనేశ్వరి
- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల సాయం

కర్నూలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు: 'అప్పులు దూరమైతే ఆ బాధ ఎలా ఉంటుందో మాకు తెలుసు. ఇకపై మీరూ మా కుటుంబ సభ్యులే. అధైర్యపడవద్దు.. మీకు అండగా టీడీపీ ఉందని చెప్పేందుకే చంద్రబాబు నాయుడు నన్ను పంపించారు. ధైర్యంగా ఉండండి..' అంటూ నారా భువనేశ్వరి బాధిత కుటుంబాలను ఓదార్చారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక తీవ్రమనోవేదనకు లోనై మృతి చెందిన టీడీపీ కుటుంబాలను ఆమె పరామర్శించారు. పెద్దకడుబూరులో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక టీడీపీ కార్యకర్త హెచ్.గోపాల్ మృతి చెందారు. ఆయన ఇంటికి వెళ్లిన భువనేశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోపాల్ భార్య జయశీలమ్మను ఓదార్చారు. ఈ సందర్భంగా జయశీలమ్మ 'మాట్లాడుతూ మీరు మా ఇంటికి రావడం మా అదృష్టం.. మా ఆయన టీడీపీ కోసం ఓ సైనికుడిగా చివరిదాకా పనిచేశాడు. మీరు ఇచ్చిన భరోసా ఎంతో ధైర్యాన్నిచ్చింది. మా పిల్లల్ని బాగా చదివించుకుంటా'మన్నారు. అనంతరం గోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చేరుకున్న భువనేశ్వరి వడ్డే ఈరమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈరమ్మ భర్త వడ్డె ఈరయ్య, కుమారులు పెద్దనాగేష్, చిన్న నాగేష్‌లకు



వడ్డె ఈరయ్యను ఓదార్చుతూ..



జయశీలమ్మకు చెక్కు ఇస్తూ..



మంత్రాలయం రామచంద్ర నగర్‌లో..



కౌతాళం మండలం హాల్విలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న భువనేశ్వరి

ధైర్యం చెప్పారు. కన్నీటి పర్యంతమైన ఈరయ్యను ఓదార్చి చెక్కును అందజేశారు. మంత్రాలయం పట్టణంలోని రామచంద్రనగర్‌లో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాగమ్మ కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. భర్త ఆంజనేయులు, కుటుంబ సభ్యులు లక్ష్మి, మనుమలు భీమేష్, మల్లేష్‌లను పరామర్శించారు. చంద్రబాబు అండగా ఉంటారని ఆమె ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. 'సాధారణ కార్యకర్త కుటుంబాలను పరామర్శిస్తారని అనుకోలేదమ్మా. మీరు మాపై చూపిన అభిమానానికి వందనాలు...' అంటూ భువనేశ్వరితో అన్నారు.

నారా భువనేశ్వరి వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు తిక్కారెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, కోట్ల సుజాతమ్మ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గుడిసె కృష్ణమ్మ, ఉలిగయ్య, కోసిగి మాజీ సర్పంచ్ ముత్తురెడ్డి, టీడీపీ నాయకులు మాధవరం రాఘవేంద్రరెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తెలుగు మహిళా నాయకురాళ్లు వెంకటేశ్వరమ్మ, కల్పన, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు యేసేపు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల జైల్‌భరో

- తాలుకా కార్యాలయం ఎదుట రహదారిపై బైఠాయింపు
- టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 9: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం దీక్షా శిబిరం నుంచి వందలాది మంది జైల్‌భరో కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. టూ టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని అంగన్‌వాడీలను అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. దీంతో అంగన్‌వాడీలు టూటౌన్ పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. స్టేషన్ ఆవరణలో బైఠాయించారు. సీఐ రాజారెడ్డి అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులతో మాట్లాడి నచ్చజెప్పడంతో నిరసనను విరమించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు నిర్మల, సీఐటీయూ ఉపాధ్యక్షుడు మద్దులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించక పోగా ఎస్మా ఉపయోగించడం దారుణమని, అయినా సమ్మె విరమించుకొనేది లేదని హెచ్చరించారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రబాబు



చంద్రబాబు నాయుడుతో బీసీ జనార్దన్‌రెడ్డి మాటా మంతి



వేదికపైన మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, మాండ్ర శివానందరెడ్డి



వేదికపైన కేఈ ప్రభాకర్, రామచంద్రయ్య, గౌరు వెంకటరెడ్డి, ధర్మవరం



వేదికపై జిల్లా పరిశీలకుడు, అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి





చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న భూమా బ్రహ్మానందరెడ్డి, విఖ్యాత్‌రెడ్డి



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అబ్దుల్ వహీద్





ఎమ్మెల్యేలపై చంద్ర నిప్పులు

నంద్యాల టౌన్/ఆళ్లగడ్డ, జనవరి 9: ఆళ్లగడ్డలో మంగళవారం నిర్వహించిన 'రా..కదలిరా' బహిరంగ సభలో నంద్యాల జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలపై వారి అవినీతి అక్రమాలను ఉద్దేశించి చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

● ఆళ్లగడ్డ ఎమ్మెల్యే కడుపుకు అన్నం తినడు. ఇసుక, ఎర్రమట్టి, అక్రమ మద్యం ద్వారా వచ్చిన సొమ్మును తింటున్నాడు. ఈయన చాలా బిజీ అంట. ఈయనను ఆపే ధైర్యం జగన్‌కు కూడా లేదంట. అంటూ గంగుల బిజేంద్రారెడ్డి తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు.

● నంద్యాలలో ఉన్న ఎమ్మెల్యేను సండే ఎమ్మెల్యే అంటారు. జాతీయ రహదారి 167ను అష్టవంకర్లు తిప్పిన ఘనత ఈయనదేంటూ శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి చురకలంటించారు.

● జగన్నాథగట్టును కొల్లగొట్టి కేజీఎఫ్‌గా మార్చి వందలాది ఎకరాలను కొల్లగొట్టిన కలెక్షన్ కింగ్ పాణ్యం ఎమ్మెల్యే అని కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు.

● ఈయన కన్ను పడితే వెంచర్లను సైతం ధారాదత్తం చేయాల్సిందే. వెంచర్ల శిల్పా అంటూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీరును ఎండగట్టారు.

● బ్రహ్మం గారు కాలజ్ఞానం రాసిన ప్రాంతం రవ్వలకొండను మింగేశాడని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.

● నందికొట్కూరులో అమాయకపు ఎమ్మెల్యే ఉన్నాడని ఆర్థర్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. అక్కడో హీరో ఉన్నాడు. రాష్ట్రమంతా ఏదో చేస్తాడంట అంటూ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై చంద్రబాబు విరుచుకపడ్డారు.

● జిల్లాలో పిట్టకథల మంత్రి ఉన్నాడని, కమ్మగా మాట్లాడుతాడని చేసేది మాత్రం ఏమీ ఉండదని, సినిమా యాక్టర్ నాగభూషణాన్ని మించి పోతాడని మంత్రి, డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథరెడ్డిని విమర్శించారు.

తప్పుడు కేసులతో జైలుకు పంపారు : భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ: టీడీపీ యువ నేత నారా లోకేశ్‌పై ఎమ్మెల్యేలు శిల్పా రవి, శిల్పా చక్రపాణి, గంగుల బిజేంద్రారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తాను ఘాటుగా స్పందించానని, దీంతో తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి భూమా అఖిలప్రియ అన్నారు. చంద్రబాబు బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతిపరులుగా మారారని ధ్వజమెత్తారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, ఆయన తల్లి సాగిస్తున్న అక్రమార్జన మితిమీరిందన్నారు. మంత్రిగా ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి చేశానని తెలిపారు.

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం : గౌరు చరిత

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. అందరం బాగుండాలంటే చంద్రబాబునాయుడును సీఎంను చేసుకోవాలని కోరారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాల వారు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మహిళలకు రక్షణ లేదని, యువతకు ఉపాధి అవకాశాలు లేవని, రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడుతున్నారని ఆరోపించారు.

రైతాంగం దెబ్బతింటోంది : గౌరు వెంకటరెడ్డి



కేసీ, తెలుగుగంగ కాలువలు, హంద్రీ-నీవా ప్రాజెక్టులను సక్రమంగా పని చేసేలా చేయకపోవడంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని కోరుకోవాలన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి మాట తప్పారని, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను ఇబ్బందులకు గురి చేయడంతో రోడ్డెక్కారని అన్నారు.

వంద రోజుల్లో కాబోయే సీఎం చంద్రబాబు : సుబ్బారెడ్డి



వంద రోజుల్లో కాబోయే సీఎం చంద్రబాబునాయుడని ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు : మల్లెల



రా.. కదలిరా బహిరంగ సభను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెబుతున్నా అని జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బనగానపల్లె ఎమ్మెల్యే తమ దైన శైలిలో భూదందాలు, అక్రమార్జనలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు సభకు భారీ ఎత్తున అభిమానులు హాజరైనందుకు ధన్యవాదాలు తెలిపారు.

వైరి వర్గానికి టికెట్?

● మంత్రి గుమ్మనూరు జయరాం ఆగ్రహం

● బీసీ మహిళ బొజ్జమ్మకు షాకిచ్చిన వైసీపీ

కర్నూలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు విరూపాక్షికి దాదాపు టికెట్ ఖరారైనట్లు సమాచారం. తాడేపల్లికి రావాలంటూ ఇప్పటికే విరూపాక్షికి ఫోన్ కాల్ వచ్చింది. ఈ నేపథ్యంలో వైరి వర్గానికి టికెట్ ఇవ్వడంపై మంత్రి గుమ్మనూరు జయరాం అనుచరులు రగిలిపోతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు జయరాంకు కర్నూలు ఎంపీ టికెట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. నిజానికి ఆయన ఆలూరు నుంచే మళ్లీ టికెట్ కావాలని పట్టుబట్టారు. ఆలూరు నుంచి టికెట్ దక్కకపోతే నియోజకవర్గంలో తనకు, తన కేడర్‌కు అవమానం అన్న రీతిలో గుమ్మనూరు వర్గం ఉన్నట్లు తెలుస్తోంది. అవన్నీ లెక్కచేయని సీఎం జగన్ మోహన్ రెడ్డి గుమ్మనూరుకు చెక్ పెట్టి విరూపాక్షి పెద్దపీట వేశారు. తాను టికెట్ ఇస్తే జడ్పీటీసీగా గెలిచిన వ్యక్తి ఇప్పుడు తన సీటుకే ఎసరు పెట్టడంపై గుమ్మనూరు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ఆ పార్టీలోని వారే చర్చించుకుంటున్నారు. ఇక మొదట్నుంచీ టికెట్ ఇస్తామని ఆశ చూపి బీసీ మహిళ కప్పట్రాళ్ల బొజ్జమ్మకు సీఎం జగన్ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. టికెట్ ఇస్తామని ఆశచూపి ఇప్పుడు 'లేదు పో' అన్నరీతిలో వైసీపీ అధిష్ఠానం వ్యవహరించడంపై బొజ్జమ్మ ఆవేదనతో ఉన్నారు.

జయరామ్‌కు టికెట్ ఇవ్వాల్సిందే..: వైసీపీ



హాలహర్విలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టిన వైసీపీ నేతలు

హాలహర్వి, జనవరి 9: మంత్రి జయరాంకు కాకుండా, వేరే వారికి ఆలూరు సీటు కేటాయిస్తే ఊరుకునేది లేదని వైసీపీ నాయకులు సీఎం జగన్మోహన్ రెడ్డికి వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం మంత్రి గుమ్మనూరు జయరాం మద్దతుదారులు ఆగ్రహంతో రాస్తారోకో నిర్వహించారు. ఆలూరు సీటుకు అభ్యర్థిని మార్చడం దారుణమని, సీఎం తీరు మారకపోతే తమ పదవులకు రాజీనామా చేస్తామని హాలహర్వి జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి అన్నారు. తప్పుడు సర్వేలతో ఆలూరు సీటు వేరెవరికైనా కేటాయిస్తే తాము ఓడించి తీరుతామని వైసీపీ నేతలు అధినేతకు వార్నింగ్ ఇవ్వడంతో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు రాజశేఖర్, లింగమల్లప్ప, బసవరాజు పాల్గొన్నారు.

విధులకు 218 మంది అంగన్‌వాడీలు

కర్నూలు కలెక్టరేట్ జనవరి 9 : ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించిన నేపథ్యంలో మంగళవారం జిల్లాలో 112 మంది అంగన్‌వాడీలు విధులకు హాజరయ్యారు. జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాలలో 1,866 మంది టీచర్లు, 1,823 హెల్పర్లు పనిచేస్తున్నారు. 29 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించింది. దీంతో మంగళవారం 112 మంది విధులకు హాజరయ్యారని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.

11 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు

కర్నూలు(అర్బన్), జనవరి 9: రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 11 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చా తెలిపారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, హెడ్స్, కోఆర్డినేటర్స్, ఇన్‌చార్జిలు, విద్యార్థులు విషయాన్ని తెలుసుకొని తిరిగి కళాశాలలు పునః ప్రారంభ రోజు తరగతులకు హాజరు కావాలని కోరారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఈ నెల 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించినట్లు జిల్లా వృత్తి విద్యా అధికారి జమీర్ పాషా మంగళవారం తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 19వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభంకానున్నట్లు ఆయన వివరించారు.

'భవిష్యత్‌కు గ్యారెంటీ'లో కర్నూలుకు ఆరో స్థానం

అధినేత చంద్రబాబును కలిసిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 9: నిత్యం ప్రజల్లో ఉంటూ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహిస్తున్న కర్నూలు నియోజకవర్గానికి టీడీపీ గుర్తింపునిచ్చింది. భవిష్యత్ గ్యారెంటీని చక్కగా నిర్వహించడంలో కర్నూలు నియోజకవర్గంలో ఆరో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంగళవారం టీడీపీ జాబితాను విడుదల చేసింది. ఇందుకు కృషి చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్‌ను పార్టీ అభినందించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆళ్లగడ్డలో చంద్రబాబును టీజీ భరత్ ప్రత్యేకంగా కలిశారు. అధినేతతో సమావేశమై నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని, నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే నియోజకవర్గంలో 58 వేల ఇళ్లకు 'బాబు ష్యూరిటీ. భవిష్యత్ గ్యారెంటీ' రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినందుకు చంద్రబాబు అభినందించినట్లు టీజీ భరత్ తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో నియోజకవర్గం పరిశీలకులు శ్రీనివాసమూర్తి, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన టీజీ భరత్, కర్నూలు టీడీపీ నాయకులు

నిజాయితీగా పని చేసే వారిని ఎన్నుకోవాలి

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బాగేల్



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(రూరల్) జనవరి 9: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిజాయితీగా పనిచేసేవారినే ఎన్నుకోవాలని, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బాగేల్ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వికసిత భరత్ సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ. వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో విడిపోకుండా అభివృద్ధి, దేశ సమగ్రతే లక్ష్యంగా ప్రజలు తమ నాయకులను ఎన్నుకోవాలని కోరారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ గార్గేయపురం గ్రామంతో తనకు ఎంతోమంచి అనుబంధం ఉందని అన్నారు. తన తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినపుడు తన (కర్నూలు అసెంబ్లీ) పరిధిలో ఉండేదన్నారు. మంచినీటి వసతి కూడా సరిగా ఉండేది కాదని, తన హయాంలో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని అన్నారు.

అనంతరం పాఠశాల మైదానంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన 12 స్టాల్స్‌ను కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బాగాల్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, బీజేపీ నాయకులు రామస్వామి, వినూషారెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకు 3.96 లక్షల ఆయుష్మాన్ కార్డులు

కర్నూలు(కల్చరల్): భారతదేశంలో ఎప్పుడూ లేని విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, ఏపీలో 1.51 కోట్ల ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేశామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బాగేల్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కర్నూలు సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో మీడియాతో మాట్లాడారు. ఆయుష్మాన్ కార్డులు, ఉచిత బియ్యం, సిలిండర్లు, కిసాన్ సమ్మాన్ నిధి, పించన్లను కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, ఈ ఆసుపత్రికి కేంద్రం వాటా రూ.72 కోట్లు కాగా, ఇప్పటికే రూ.54 కోట్లు విడుదల చేశామని, మరో రూ.18 కోట్లు కూడా త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకరరెడ్డి ఆసుపత్రికి కొత్తగా 3-టెస్లా ఎంఆర్ఐ మిషన్‌ను మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

మంత్రాలయం, జనవరి 9: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్ కమిటీ చైర్మన్ కళావతి, కర్నూలు అడిషనల్ జిల్లా జడ్జి ప్రతిభదేవి మంగళవారం వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. వారు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు



మంచాలమ్మను దర్శించుకుంటున్న కర్నూలు అడిషనల్ జిల్లా జడ్జి ప్రతిభదేవి

పీఎం జన్‌మన్‌కు స్థల పరిశీలన

పాణ్యం, జనవరి 9 : ఈ నెల 15వ తేదీన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమ నిర్వహణలో భాగంగా మంగళవారం శ్రీశైలం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి బలపనూరు పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ప్రధాని గిరిజనులతో ముఖాముఖి మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సమావేశ స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం బాలుర గురుకుల పాఠశాల, పల్నాడు జిల్లా సిరిగిరిపాడు గిరిజన ఆశ్రమ పాఠశాలలు పరిశీలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక సహకారం

పాణ్యం, జనవరి 9 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యార్థుల ద్వారా సాంకేతిక సహకారం అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్‌లో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో విద్యార్థులు మెరుగైన ప్రయోగాలు చేయడానికి మెరుగైన అభ్యాసం చేయడానికి విద్యాశాఖ ఫైనల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఇంజనీరింగ్ కళాశాలల్లోని 2 వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలనేది భవిష్యత్ నైపుణ్య నిపుణుల ఆలోచన అన్నారు. శిక్షణ తీసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎంఈఓ కోటయ్య, సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ భవనానికి రూ.లక్ష విరాళం


నిర్వాహకులకు నగదును అందజేస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), జనవరి 9: స్థానిక భరతమాత గుడి సమీపంలో నిర్మాణంలో ఉన్న విశ్వహిందూ పరిషత్ భవనానికి నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హిందువులు సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి ఈ భవనం చాలా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అభిరుచి మధును విశ్వహిందూ పరిషత్ నాయకులు, అర్చకులు సన్మానించారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి

నంద్యాల (కల్చరల్), జనవరి 9: ప్రముఖ సాంఘిక సంస్కర్త షేక్ ఫాతిమా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో నూనెపల్లె నవభారత్ పబ్లిక్‌స్కూల్‌లో షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు ముర్తుజా, జిల్లా కార్యదర్శి మహబుబ్ బాషా, మురసం జిల్లా అధ్యక్షుడు రఫీ, అబ్దుల్ సమద్, నీలకంఠమాచారి, నవభారత్ హెూస్పెస్ తదితరులు పాల్గొన్నారు.

విరాళ దాతలకు మరిన్ని సదుపాయాలు

● సమావేశమైన ధర్మకర్తల మండలి


ధర్మకర్తల మండలి సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరాజు

శ్రీశైలం, జనవరి 9: శ్రీశైలం దేవస్థాన విరాళ దాతలకు క్షేత్రంలో మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పించాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. మంగళవారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో మొత్తం 59 ప్రతిపాదనలను ప్రవేశ పెట్టగా వాటిలో 57 ఆమోదించగా, రెండు అంశాలని గురించి కమిషనర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. భక్తులు సేదతీరేందుకు 20 ఎలకరాలలో ఉద్యానవనం, నూతన కళామందిర నిర్మాణం, మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు సంప్రదాయ కుటుంబ జీవన విధాన భవనం ఏర్పాటు, గోసేవకై సప్తగోకులం ఏర్పాటు, నందిసర్కిల్ వద్ద రోడ్డు విస్తరణ, క్షేత్రపరిధిలో అవసరమైన చోట్ల విద్యుత్ దీపాల ఏర్పాటు మొదలైన వాటికి ఆమోదం తెలిపినట్లు చైర్మన్ తెలిపారు.

బాలికపై వృద్ధుడి అసభ్య ప్రవర్తన

● పోక్సో కేసు నమోదు

జూపాడుబంగ్లా, జనవరి 9: మండలంలో ఏడేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించినందుకు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. మంగళవారం సాయంత్రం బాలిక ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వృద్ధుడు మాయమాటలు చెప్పి అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేయడం తల్లి గమనించింది. ఈ మేరకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

కుంకనూరులో దొంగతనం

దేవనకొండ, జనవరి 9 : మండలంలోని కుంకనూరు గ్రామంలో రెండు నెలల కింద వలస వెళ్లిన తలారి శేఖర్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి దగ్గర తల్లికి ఉంచి వలస వెళ్లిన శేఖర్ సోమవారం సాయంకాలం గ్రామానికి చేరుకొని ఇంట్లో వున్న బీరువా తెరచి చూశాడు. అందులో ఉన్న ఉండాల్సిన 4 తులాలు బంగారు ఆభరణలు, రూ.1.8 లక్షల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై భూపా లుడు తమ సిబ్బందితో ఘటన స్థలాని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.


ఆత్మకూరు, మహానంది, జూపాడుబంగ్లా నుంచి ఆళ్లగడ్డకు తరలుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చంద్రన్న సభకు భారీగా తరలిన తమ్ముళ్లు

ఆత్మకూరు, జనవరి 9: ఆళ్లగడ్డలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రా.. కదలిరా.. కార్యక్రమానికి జిల్లా నుంచి తెలుగుతమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 200 వాహనాల్లో దాదాపుగా 4వేల మంది టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఒక్క ఆత్మకూరు పట్టణం నుంచే 60వాహనాలను కళ్యాణదుర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు జెండా ఊపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలనననుఅంతమొందించేందుకు టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పట్ల ప్రజల్లో విశేషమైన స్పందన వస్తోందని వివరించారు. ఇందులో భాగంగానే శ్రీశైలం నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చారని వివరించారు. ఇదేస్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నియోజకవర్గ పరిశీలకులు వక్కలగడ్డ మల్లికార్జున, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, వెన్నా శ్రీధర్‌రెడ్డి, రాజారెడ్డి, పుల్లారెడ్డి, రవీంద్రబాబు, ఫక్రుద్దీన్ ఉన్నారు.

గడివేముల : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం నిర్వహించిన రా.కదలిరా కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, నారాయణరెడ్డి, సుభద్రమ్మ, రంగస్వామినాయక్, రాజునాయక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సభకు మండలంలోని టీడీపీ నాయకులు అధికసంఖ్యలో వెళ్లారు. నాయకులు కడియం వెంకటేశ్వర్లు యాదవ్, గుండ్రెడ్డిమోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, రమణారెడ్డి, రామోహ్మన్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీగా సభకు వెళ్లారు. చాలామంది స్వచ్ఛందంగా వివిధ వాహనాలు కార్యకర్తలు, అభిమానులు బయలు దేరారు.

మహానంది : 2024 ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో టీడీపీ చేపట్టిన రా కదలి రా తెలుగుదేశం బహిరంగ సభ మంగళవారం ఆళ్లగడ్డలో జరిగే బహిరంగ సభకు మహానంది మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతుండటంతో టీడీపీ నాయకులు ఉత్సాహంగా తరలివెళ్లారు. శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నియోజక వర్గ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల్లో టీడీపీ నాయకులు ఆళ్లగడ్డకు తరలివెళ్లారు.


పాములపాడు, గడివేముల, నందికొట్కూరు నుంచి చంద్రబాబు సభకు తరలుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వైసీపీలో అసమ్మతి

● కార్తీక్ ప్రీమియర్ లీగ్ టోర్నీలో విభేదాలు బహిర్గతం
● మున్సిపల్ చైర్మన్‌తో సహా పలువురు కౌన్సిలర్ల దూరం
● ఆత్మకూరులో చర్చనీయాంశంగా కౌన్సిల్ సభ్యుల తీరు


టోర్నీని ప్రారంభిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 9: ఆత్మకూరులో మరోసారి అధికార వైసీపీలో విబేధాలు బహిర్గతమయ్యాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శ్రీశైల నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నీని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పేరుతో ప్రీమియర్ లీగ్ టోర్నీ నిర్వహించేందుకు అట్టహాసంగా ఏర్పాట్లు చేశారు. టోర్నీ ప్రారంభోత్సవాన్ని మంగళవారం ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించారు. నియోజకవర్గస్థాయిలో జరుగుతున్న ఈటోర్నీ ప్రారంభోత్సవానికి శ్రీశైలంతో సహా పలు మండలాల నుంచి ముఖ్యనాయకులు తరలివచ్చారు. అయితే ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్‌తో పాటు సుమారు 15మంది కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు టోర్నీ ప్రారంభోత్సవానికి రాకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆత్మకూరు మండలంతో పాటు సదూర మండలాల నుంచి ముఖ్యనాయకులందరూ టోర్నీ ప్రారంభోత్సవానికి హాజరైతే స్థానికంగా కౌన్సిల్ సభ్యులు దూరంగా ఉండటంపై అనుమానాలు ఊపందుకున్నాయి. కొంతకాలంగా ఎమ్మెల్యే శిల్పా తీరుపై మున్సిపల్ చైర్మన్ తండ్రి ఎం.ఏ.రషీద్ అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. తాము మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్నప్పటికీ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను కాదని ఇతరులకు పెత్తనం ఇస్తున్నారంటూ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఇటీవల చాలా మంది కౌన్సిలర్లను తనవెంట విహారయాత్రకు తీసుకెళ్లి తనకు గ్రూపు ఉన్నట్లు చాటుకున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే కార్తీక్ ప్రీమియర్ లీగ్‌కు దూరంగా ఉండటంతో కావాలనే ఆయన టోర్నీకి హాజరు కాలేదన్న ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే టోర్నీ ప్రారంభోత్సవానికి ముందు పట్టణంలో వెయ్యి బైకులతో ర్యాలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే కౌన్సిలర్లు రాకపోవడంతో కేవలం 200బైకులతో ర్యాలీని ముగించడమే ఆ పార్టీలో నెలకొన్న విబేధాలకు నిదర్శనమని పలువురు వ్యాఖ్యానించారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

● ఇద్దరి అరెస్టు

నంద్యాల క్రైం, జనవరి 9 : నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో టీకేసింగ్ కాలనీలో మంగళవారం 40 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ కె.రాజారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి టీకేసింగ్ కాలనీకి చెందిన చెమికల జనార్దన్‌రెడ్డితో పాటు అతడి అనుచరుడు కుడుముల గంగాప్రవీణ్‌రెడ్డిను మంగళవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అందిన సమాచారం మేరకు తనతోపాటు ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి బియ్యం లోడ్‌తో ఉన్న ఆటోను సీజ్ చేసి నిందితులిద్దరినీ అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసిన సుమారు 40 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని ఎవరైనా కొన్నా, అక్రమంగా రవాణా చేసినా అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. నంద్యాల రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనులు, మట్కా, జూదంలాంటివి జరుగుతున్నట్లయితే ప్రజలు సెల్ నెం. 9121101087కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ వేగవంతం చేయండి

నంద్యాల (కల్చరల్), జనవరి 9: సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రజా పంపణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులు పెండింగ్ లేకుండా కార్డుదారులకు పంపిణీ చేయాలని జేసీ రాహుల్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జేసీ చాంబర్‌లో రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్, అసైన్డ్ భూముల విచారణ తదితర అంశాలపై మండల తహసీల్దారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న భూహక్కు భూరక్ష పథకం క్రింద రీసర్వే చేపట్టిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియకు సంబంధించి అన్ని పనులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న 15 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీలోపు పూర్తి కావాలన్నారు. వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌లలో ఉన్న ఇనాం భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి పెండింగ్లో ఉన్న అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి పనుల ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ, వెంకటరాముడు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

● సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు

గోస్పాడు, జనవరి 9: ప్రజలను నిలువునా దోపిడీ చేస్తూ నిరంకుశ పాలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం గోస్పాడు మండలం పసురుపాడు గ్రామంలో సీపీఐ సమావేశం మండల సహాయ కార్యదర్శి జిలానీబాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ సుంకయ్య, మోటా రాముడు, ఆంధ్రప్రదేశ్ వైశా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాథ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజన్న రాజ్యాన్ని తెస్తానని ప్రజలకు మేలు చేస్తానని పాదయాత్రలో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతూ ప్రజలపై అధిక ధరలు మోపి దోపిడీ చేస్తున్నాడని, ఇలాంటి అరాచక పాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వ్యతిరేకించి తరిమికొట్టాలని అన్నారు. రాష్ట్రాన్ని గత నాలుగున్నరేళ్ల నుంచి జగన్ ప్రభుత్వం నియంతల వ్యవహరిస్తూ ప్రజాపాలనను నిర్వీర్యం చేశాడని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, కరెంటు చార్జీలు, బస్సు చార్జీలు ప్రజలపై భారం వేస్తున్నారని అన్నారు. మరో వైపు స్థానిక సంస్థలను నీర్వీర్యం చేస్తూ, ఇసుక, మట్టి అక్రమార్కులకు అండగా ఉంటూ, అక్రమ మద్యం వ్యాపారానికి తెరలేపారని అన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక పాలన మానుకొని ప్రజా సంక్షేమానికి పాటుపడాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కంబగిరి, నరసింహులు, వెంకటేశ్వర్లు, నడిపి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోండి

నంద్యాల రూరల్, జనవరి 9 : మండలంలోని పులిమద్ది, భీమవరం గ్రామాలలో మంగళవారం జొన్న అవగాహన సదస్సు జరిగింది. వ్యవసాయ శాఖ నిర్వహించిన ఈ సదస్సులో మండల వ్యవసాయాధికారి ఇర్ల ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 2023-24 సీజన్‌కు గాను 9వేల ఎకరాల్లో జొన్న సాగు జరగగా కేవలం 5,800 ఎకరాలకు మాత్రమే ఈ క్రాప నమోదైందని పేర్కొన్నారు. అవగాహన సదస్సులో సర్పంచ్ భక్త వత్సలమ్మ పాల్గొన్నారు.

వంటల పోటీలు

నంద్యాల (కల్చరల్), జనవరి 9: నంద్యాల బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో భవనాశి జ్యువెలర్స్ సహకారంతో మంగళవారం మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ వసుధ, మనోహర్‌రెడ్డి వ్యవహరించారు. మహిళలు తమ ఇంటివద్దనే వంటలు తయారు చేసుకొని వచ్చి కల్యాణ మండపంలో ప్రదర్శించారు. విజేతలకు భవనాశి జ్యువెలర్స్ అధినేత భవనాశి నాగమహేశ్, భవనాశి వాసుల సహకారంతో బహుమతులు అందజేశారు.

అటవీ శాఖ సిబ్బంది క్రీడలు ప్రారంభం

నంద్యాల రూరల్, జనవరి 9 : జిల్లాలో మొదటిసారి అటవీ శాఖ అధికారుల, సిబ్బంది క్రీడలు మంగళవారం ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే క్రీడలను అటవీ శాఖ కన్జర్వేటర్ డీఎస్ఎన్ మూర్తి, డీఎఫ్ఓ అనురాగ్ మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ సిబ్బందిలో ఉత్సాహం నింపి వృత్తి నైపుణ్యం పెంచడానికి ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నంద్యాల, గిద్దలూరు, ఆత్మకూరు, మార్కాపురం అటవీ డివిజన్‌ల సిబ్బంది 200 మంది పాల్గొంటున్నారన్నారు. రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్ తదితర విభాగాలలో క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీ అధికారులు అలాంగ్ చాంగ్, విఘ్నేష్ అప్పన్, వెంకటనరసింహులు, ఎఫ్‌ర్వోలు, డీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ ఎంపిక పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 9: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా మైదానంలో కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల బాల, బాలికల కబడ్డీ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఏపీ సీఎం కప్ కోఆర్డినేటర్ ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఏపీరెడ్డి, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్‌హుసేన్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు, అధ్యక్షుడు నాగేంద్ర, పాణ్యం ఎంఈవో సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని, ఎంపికైన జట్లు త్వరలో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి విజేతగా పాలిటెక్నిక్ కళాశాల


బాల్‌బ్యాడ్మింటర్ బాలుర విజేతగా పాలిటెక్నిక్ కళాశాల జట్టు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 9: నంద్యాలలోని ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల జట్టు రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ బాలుర విజేతగా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 5,6,7 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో బాల్ బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో తమ కళాశాల జట్టు అత్యంత ప్రతిభ కనబర్చి సెమీ ఫైనల్స్‌లో ఈస్ట్‌గోదావరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టుపై 35-32, 35 -26 స్కోర్ తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరిందని అన్నారు. ఫైనల్ పోరులో గుడ్లవల్లేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టుపై 39-37, 35-29 స్కోర్ తేడాతో ట్రోఫీని కైవసం చేసుకుందని తెలిపారు.

వేల్పనూరులో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

వెలుగోడు జనవరి 9 : మండలంలోని వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామ గ్రామన ధార్మిక వ్యాప్తిలో భాగంగా మూడు రోజులు పాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


నంద్యాలలో పంగ నామాలతో నిరసన తెలుపుతున్న మున్సిపల్‌కార్మికులు

జగన్ నమ్మించి మోసం చేశాడు..

నంద్యాల టౌన్, జనవరి 9: మాయమాటలతో నమ్మించి సీఎం జగన్ మోసం చేశారని సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం మున్సిపల్ కార్మికులు నుదిటిపై పంగ నామాలు పెట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా దీక్షా శిబిరంలో కూర్చున్నారు.

ఆత్మకూరు: సమ్మెలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని ప్రజాసంఘాల నాయకు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు చేపడుతున్న నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆయా సంఘాల వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీల జైల్ భరో

వెలుగోడు జనవరి 9 : అంగన్‌వాడీల పోరాటాన్ని అణచివేసేందుకు ప్రవేశ పెట్టిన ఎస్మా జీవో రెండును వెంటనే రద్దు చేయాలని, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం వెలుగోడులో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినాదాలు చేస్తూ ర్యాలీ చేసి జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు.

నందికొట్కూరు రూరల్ : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 29 వరోజుకు చేరుకుంది. మంగళవారం నందికొట్కూరు పట్టణంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో కేజీ రోడ్డును దిగ్బంధం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరావు, సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కరెడ్డి, పక్కీర్ సాహెబ్, యూనియన్ నాయకులు శివలక్ష్మి, మదార్‌బీ , ప్రసన్నలక్ష్మి, సుబ్బలక్ష్మి, రమణమ్మ, శైలజ పాల్గొన్నారు.


నందికొట్కూరు లో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

తెలుగు తమ్ముళ్ల సందడి

● ఆళ్లగడ్డలో చంద్రబాబు సభకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ● బైకు ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్న పార్టీ శ్రేణులు
చంద్రబాబును కలిసిన టీడీపీ, జనసేన నాయకులు ● సభ విజయవంతం కావడంతో శ్రేణుల్లో జోష్


భూమా ఘాట్‌లోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుతో అఖిలప్రియ, కుటుంబ సభ్యులు


శిరివెళ్ల మండలం యర్రగుంట్ల నుంచి వెళ్తున్న టీడీపీ నాయకులు


ప్యాపిలి నుంచి ఆళ్లగడ్డకు తరలుతున్న నాయకులు


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జనసేన సమన్వయకర్త మైలేరి పుల్లయ్య


రుద్రవరం మండలం కొండమాయపల్లె నుంచి బైకు ర్యాలీ


రుద్రవరం మండలం ముత్తలూరు నుంచి వెళ్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు


సభకు తరలివచ్చిన అంగన్‌వాడీలు


చంద్రబాబుకు అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 9: ఎన్నికల శంఖారావం పూరించేందుకు, టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు ఆళ్లగడ్డ పట్టణంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. 'రా.. కదలి రా' నినాదంతో చేపట్టిన సభ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులతో కిక్కిరిసింది. ఇందులో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఇలా సాగింది.

● మధ్యాహ్నం 2.35 గంటలకు భూమా ఘాట్‌లోని హెలిప్యాడ్ వద్దకు నారా చంద్రబాబు హెలికాఫ్టర్ చేరుకుంది.

● భూమా ఘాట్‌కు చేరుకున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పరిశీలకుడు ప్రభాకర్ చౌదరి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా మాజీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, జిల్లాలోని పలువురు టీడీపీ ముఖ్య నాయకులు చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికారు.

● మధ్యాహ్నం 2.50 గంటలకు దివంగత నేతలు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డి సమాధుల వద్ద నారా చంద్రబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● మధ్యాహ్నం 3.05 గంటలకు చంద్రబాబు కాన్వాయ్ హెలిప్యాడ్ వద్ద నుంచి బయలుదేరింది.

● మధ్యాహ్నం 3.15 గంటలకు చంద్రబాబు సభా ప్రాంగణానికి చేరుకుని టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మధ్యాహ్నం 3.20 గంటలకు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ సభా వేదికపై ప్రసంగించారు.

● మధ్యాహ్నం 3.22 గంటలకు టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ వేదికపై మాట్లాడారు.

● మధ్యాహ్నం 3.38 గంటలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సభా వేదికపై ప్రసంగాన్ని ప్రారంభించి సాయంత్రం 4.33 గంటలకు ముగించారు.

● ప్రసంగం అనంతరం నారా చంద్రబాబు భూమా ఘాట్ వద్ద ఉన్న హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి కాన్వాయ్‌లో రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

● సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద టీడీపీ, జనసేన స్టిక్కర్లు, కీ చైన్లు, లాకెట్‌లు కొనుగోలు చేసేందుకు టీడీపీ శ్రేణులు ఉత్సాహం కనబరిచారు. అభిమానులు ఆ స్టిక్కర్లను మొబైల్స్‌కు, తమ వాహనాలకు అతికించుకున్నారు.

● అభిమాన నాయకుడు చంద్రబాబు చూసేందుకు ప్రజలు భారీస్థాయిలో కుర్చీలు ఎక్కి నిలబడ్డారు. దీంతో వేలాది మంది ప్రజలు ఎల్‌ఈడీ స్ర్కీన్లలో చంద్రబాబు ప్రసంగాన్ని తిలకించారు.

● భారీ బహిరంగ సభ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా భూమా అఖిలప్రియ.. సీఎం నారా చంద్రబాబుతో సచివాలయంలో మాట్లాడుతున్న ఫొటోలు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆళ్లగడ్డకు చేరుకున్నప్పుడు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలు ఆయన వెంట నడుస్తున్న ఫొటోలతో పాటు వివిధ సందర్భాల్లోని చిత్రాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఆళ్లగడ్డ: తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా కార్యక్రమానికి వచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అహోబిలం అర్చకులు మంగళవారం ఆశీర్వదించారు. ఆయనను శ్రీలక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని బహూకరించి శాలువ, పూలమాలలతో సత్కరించి, ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందించారు.

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచే వైసీపీ పతనం ప్రారంభమైందని మాజీ ఎంపీపీ, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి


చాగలమర్రిలో బైకు ర్యాలీ చేస్తున్న భూమా యూత్ సభ్యులు

శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పర్యవేక్షణలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన 'రా.. కదలిరా' ఎన్నికల శంఖారావానికి శిరివెళ్ల మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు, మహిళలు, ప్రజలు భారీ ఎత్తున తరలివెళ్లారు.

రుద్రవరం: ఆళ్లగడ్డలో మంగళవారం జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సభకు రుద్రవరం మండలం నుంచి భారీసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు మోటరు సైకిళ్ల, వాహనాల్లో తరలివెళ్లారు.

● టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై అభిమానంతో వయసు తేడా లేకుండా చిన్నారుల నుంచి పెద్దల వరకు మంగళవారం తరలివచ్చారు. సభ విజయవంతమైంది. ఆళ్లగడ్డ మండలం బత్తలూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి వాకర్‌తో నడుచుకుంటూ సభాప్రాంగణానికి తరలివచ్చారు. శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెందిన జన సైనికుడు రాజశేఖర్‌రెడ్డి వీల్ చైర్‌పై సభా ప్రాంగణానికి చేరుకున్నారు. శిరివెళ్ల మండలం అంగన్వాడీ కార్యకర్తలు చంద్రబాబుసభకు తరలివచ్చి వినతిపత్రం అందించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని టీడీపీ కార్యాలయం వద్ద రా..కదలిరా సభకు వెళ్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● మాబులాల్, ముల్లాష్యాబుల్, గఫార్, భూమా యూత్ సభ్యులతో కలిసి చాగలమర్రి పురవీధుల గుండా మోటార్‌సైకిళ్లపై ర్యాలీ నిర్వహించి ఆళ్లగడ్డకు తరలివెళ్లారు. చంద్రబాబు సభా వేదికపై ఆళ్లగడ్డ జనసేన సమన్వయకర్త మైలేరి పుల్లయ్య పుష్పగుచ్ఛం అందజేశారు. చాగలమర్రి మండలం నుంచి 400 వాహనాల్లో 5వేల మందికి పైగా రా..కదలిరా సభకు తరలివెళ్లినట్లు టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు.

బనగానపల్లె/కోవెలకుంట్ల: ఆళ్లగడ్డ పట్టణంలో మంగళవారం నిర్వహించిన రా.కదలిరా.. చంద్రబాబు నాయుడు సభకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆద్వర్యంలో మంగళవారం భారీగా తరలివెళ్లారు. బీసీ జనార్దన్‌రెడ్డి అధ్వర్యంలో మండలంలోని అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె మండలాల నుంచి 400కు పైగా వాహనాల్లో టీడీపీ శ్రేణులు ఆళ్లగడ్డ సభకు తరలివెళ్లారు. బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన టీడీపీ శ్రేణులు బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. కోవెలకుంట్ల పట్టణం మీదుగా వందలాది వాహనాలు ఆళ్లగడ్డ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. కోవెలకుంట్ల పట్టణంలోని కృష్ణతేజా ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు బీసీ భోజనం సదుపాయాలు చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బహిరంగ సభకు భారీగా తరలివెళ్లినట్లు తెలిపారు. చంద్రబాబు సభను విజయవంతం చేయడానికి వచ్చిన బనగానపల్లె నియోజవకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు బీసీ ధన్యవాదాలు తెలిపారు.

డోన్: టీడీపీ డోన్ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరయాదవ్, వలసల రామకృష్ణ ఆళ్లగడ్డలోని సభకు తరలివెళ్లారు. వీరితో పాటు నాయకులు సీఎం శ్రీనివాసులు, శ్రీనివాసులు యాదవ్, ప్రజావైద్యశాల మల్లి కార్జున, ధర్మవరం గౌతంరెడ్డి, ఎస్ఎండీ రఫీ, గోసనపల్లి మల్లయ్య, తెలుగు రామాంజనేయులు, రాముగౌడ్, తదితరులు తరలివెళ్లారు. ఆళ్లగడ్డలో సభా వేదిక వద్ద చంద్రబాబుకు సుబ్బారెడ్డి పూలబొకేను అందించి అభినందనలు తెలిపారు. వేదికపై చంద్రబాబుతో గౌతం రెడ్డి, స్వాగతం పలికారు.

ప్యాపిలి: ప్యాపిలితో పాటు కలచట్ల, జలదుర్గం, వెంగళ్లాపల్లి, పెద్దపూదిళ్ల, పోతుదొడ్డి, గార్లదిన్నె తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు వంద వాహనాలకు పైగా తరలివెళ్లారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.


చాగలమర్రి నుంచి బయలుదేరుతున్న టీడీపీ నాయకులు


ఆళ్లగడ్డకు బయలుదేరుతున్న పెద్దవంగలి యూత్ సభ్యులు


శిరివెళ్ల మండలం గోవిందపల్లె నుంచి..


బనగానపల్లె పట్టణంలో వాహనాల్లో వెళ్తున్న నాయకులు


చంద్రబాబుకు బొకే అందజేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి


చంద్రబాబుతో ధర్మవరం గౌతమ్ రెడ్డి


రుద్రవరం మండలం ఆలమూరు నుంచి..

ఆలయానికి రూ.5 లక్షల విరాళం


ఈవో రామానుజన్‌కు నగదును అందిస్తున్న భక్తులు

బనగానపల్లె, జనవరి 9: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి మంగళవారం భక్తులు రూ.5 లక్షల విరాళాన్ని ఆలయ ఈవో రామానుజన్‌కు అందించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పల్లా శేషయ్య కుమారుడు పల్లా రవీంద్రబాబు కుటుంబ సభ్యులు నగదును అందజేశారు. ఈవో మాట్లాడుతూతూ దాతలు విరివిగా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

బనగానపల్లె, జనవరి 9: బనగానపల్లె పట్టణంలో అయోధ్యరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి గెలవాని ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 70 శాతం గ్రామాల్లో అయోధ్య రాముని అక్షింతలు, శ్రీరామముని చిత్రపటం, అయోధ్య ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను పంపిణీ కార్యక్రమం పూర్తయినట్లు తెలిపారు. ప్రముఖ వ్యక్తులకు అయోధ్య అక్షింతలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అయోధ్యలో ఈనెల 22న ప్రాణప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఆ సమయంలో ప్రతి ఇంట్లో హిందువుల దీపాలు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జనవరి 9: వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్, ధినేష్ సూచించారు. మంగళవారం మద్దూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాహ్మణపల్లె, మద్దూరు గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు అనూష, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, వైద్య ఉద్యోగులు వెంకటేశ్వర్లు, రామలింగారెడ్డి, వెంకటమ్మ, వెంకటలక్ష్మి, ఫార్మాసిస్టు రాజేష్, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాసులు, నాయక్, తేజశ్విని, కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రుద్రవరం: ఆరోగ్యం ప్రతి కుటుంబానికి అందించేందుకే ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించినట్లు ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం యల్లావత్తులలో ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. తరలివచ్చిన వారికి వైద్యాధికారులు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, కార్యదర్శి పాములేటి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ముట్టడి


డోన్‌లో స్టేషన్ లోపలికి రాకుండా అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు


బనగానపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన

డోన్(రూరల్), జనవరి 9: ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన 'జైల్ భరో' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలు మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. గత కొన్ని రోజులుగా తమ సమస్యలను పరిస్కరించాలని సమ్మె చేస్తున్న తమను విధులకు హజరుకాకపోతే ఎస్మా ప్రయోగిస్తామని ప్రభుత్వం బెదిరించడం దుర్మార్గమని అన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదన్నారు. సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీలులు భారీగా తరలివచ్చి బనగానపల్లె పట్టణంలో 'జైల్ భరో' కార్యక్రమం నిర్వహించారు. వారు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకుంది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని దీక్ష శిబిరం నుంచి ర్యాలీగ బయలు దేరి పెట్రోల్ బంకు కూడలిలో మానవహారం నిర్మించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు గావించారు. దీంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుధాకర్, ఎల్లయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రోజారమణి, అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు. సీపీఎం నాయకులు సుధాకర్, ఎల్లయ్య, సుబ్బయ్య, యూనియన్ నాయకురాలు రోజారమణిలు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదని స్పష్టం చేశారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని ఏఐఎస్‌టీయూసీ కౌన్సిలర్ చంద్రకళ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. మంగళవారం చాగలమర్రి అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. 29 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అనంతరం అంగన్‌వాడీలు ఆళ్లగడ్డలో జరిగే రా..కదలిరా బహిరంగ సభకు వివిధ వాహనాల్లో తరలివెళ్లి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు.

ఆళ్లగడ్డ: అంగన్‌వాడీ కార్యకర్తలు అధైర్యపడోద్దని కార్యకర్తల సంఘం అధ్యక్షురాళ్లు సీతామహాలక్ష్మి, సుమలత అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సమ్మె కొనసాగింది.


చాగలమర్రిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన


ఆళ్లగడ్డలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

టీడీపీ నాయకుడి మృతి


రామచంద్రుడు (ఫైల్)

ప్యాపిలి, జనవరి 9: మండలంలోని కలచట్ల గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు రామచంద్రుడు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసు పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విష మంగా మారడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామచంద్రుడు మృతికి పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

'వివేకానందుడి బోధనలు ఆదర్శం'


నివాళి అర్పిస్తున్న బ్రహ్మనందాచారి

బనగానపల్లె, జనవరి 9: వవేకానందుడి బోధనలు ప్రపంచానికే ఆదర్శమని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మనందాచారి అన్నారు. మంగళవారం పలుకూరు గ్రామంలోని రామాలయంలో స్వామివివేకానంద బోధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బ్రహ్మనందాచారి మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో నడవాలన్నారు. తమ ఇష్టమైన దైవం కోసం ఒక గంట ప్రార్థనలు చేసి సమయం కేటాయించాలన్నారు. వివేకానందుడి బోధనలు వ్యాప్తి చస్తున్న కొండలరావును సత్కరించారు. కార్యక్రమంలోఆలయ పూజారి శ్రీనివాసులు, కేశ వెంకటసుబ్బయ్యగౌడ్, బాలహనుమంతు, రాజు, చంద్ర మోహన్, శ్రీనివాసులు, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

చాగలమర్రి, జనవరి 9: చాగలమర్రి గ్రామంలోని క్రీడాకారులకు టీషర్ట్‌లు, టోపీలను గ్రామ పంచాయతీ సర్పంచ్ తులశమ్మ మంగళవారం పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఈవో నాగమణి మాట్లాడుతూ గ్రామంలోని ఐదు సచివాలయ పరిధిలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలకు సంబంధించిన 223 మంది క్రీడాకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన టీషర్టులు, టోపిలను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.